# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

**జూలై 7, 2011**

## ఎస్‌పీవోలకు (ప్రత్యేక పోలీసు అధికారులకు) మావోయిస్టుల విజ్ఞప్తి

## మన వేలితోనే మన కళ్లను పొడిపించే ప్రభుత్వ కుట్రలను ఓడించండి!

## దోపిడీపీడకుల కోసం పోరాడడం మానేసి మీ మీ గ్రామాలకు మరలి రండి!!

సామాజిక కార్యకర్త నందినీ సుందర్, చరిత్రకారుడు రామచంద్ర గుహ, మాజీ ప్రభుత్వాధికారి ఈ.ఏ.ఎస్. శర్మలు వేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ 2011 జూలై 4న సర్వోన్నత న్యాయస్థానం మావోయిస్టులతో పోరాడే నెపంతో ఆదివాసులను ఎస్‌పీవో (స్పెషల్ పోలీస్ ఆఫీసర్)లుగా నియమించడాన్నీ, వాళ్లను తుపాకులతో సాయుధం చేయడాన్నీ నిలిపివెయ్యాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎస్‌పీవోల నియామకాన్నే సుప్రీం కోర్టు రాజ్యాంగవిరుద్ధమని వ్యాఖ్యానించింది. ఇంతకు మునుపు కూడా సల్వాజుడుం, ఎస్‌పీవో, కోయ కమాండోలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు పలు మార్లు ఇలాంటి వ్యాఖ్యలే చేసింది.

నిజానికి 2005లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారం సల్వాజుడుం పేరుతో ఫాసిస్టు నిర్బంధ క్యాంపెయిన్ ప్రారంభించిన నాటి నుండే ఆదివాసీ యువజనులను ఎస్‌పీవోలుగా నియమించే ప్రక్రియ మొదలైంది. అప్పటి నుండి మొదట సల్వాజుడుం పేరుతో, తర్వాత ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో వరుసగా కొనసాగిస్తున్న నిర్బంధ క్యాంపెయిన్లలో దాదాపు 700 గ్రామాల్ని ధ్వంసం చేశారు. ఒక్కో గ్రామాన్ని అనేక మార్లు దఫదఫాలుగా కాల్చివేశారు. 1200కు పైగా మందిని హత్య గావించారు. వందల మంది మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. వీళ్లలో అనేక మందిని హత్య చేశారు. ధాన్యం కాలబెట్టారు. సంపదల్ని దోచుకున్నారు. కోళ్లు, పందులు, మేకలు వంటి పెంపుడు జంతువుల్ని ఎత్తుకెళ్లి తిన్నారు. ఈ బీభత్సకర చర్యలన్నిటిలోనూ ఆదివాసుల నుండి ఎస్‌పీవోలుగా చేర్చుకున్న వాళ్లనే ముందు నిలబెడుతూ వచ్చారు. పోలీసులకు, అర్ధసైనిక బలగాలకు తోవలు చూపించడానికీ, గ్రామాలపై దాడుల సందర్భంగా ప్రజల్ని, ఇళ్లను గుర్తించడంలోనూ ఎస్‌పీవోలనే ముందుంచారు. ఆ తర్వాత ఎస్‌పీవోలను పెద్ద ఎత్తున రిక్రూట్ చేసుకోవాలనే నిర్ణయం తీసుకోవడంతో వాళ్ల సంఖ్య ఇప్పుడు దాదాపు ఐదు వేలకు పెరిగింది. ఎస్‌పీవోలలో ఎంపిక చేసిన వాళ్లకు గ్రేహౌండ్స్‌తోనూ, సైన్యానికి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్ దళంతోనూ శిక్షణ ఇప్పించి కోయ కమాండో పేరుతో మరో బలగాన్ని తయారు చేశారు. ఈ అన్ని సాయుధ బలగాలు అమలు చేసిన నిర్బంధ చర్యలన్నిటితో కూడా మావోయిస్టు వుద్యమాన్ని అణిచెయ్యడం సాధ్యం కాకపోవడంతో దోపిడీ ప్రభుత్వాలు తమ చివరి అస్త్రమైన సైన్యాన్ని దించేశాయి. ప్రస్తుతం 'శిక్షణ' పేరుతోనే సైన్యం మోహరింపు జరుగుతున్నప్పటికీ వాస్తవానికి 'ప్రజలపై సాగుతున్న యుద్ధం'లో సైన్యాన్ని ప్రత్యక్షంగా వుపయోగించే క్రమం మొదలైంది.

దండకారణ్యంలో నిక్షిప్తమై వున్న అపారమైన ప్రకృతి సంపదల్ని బహుళజాతి, బడా పెట్టుబడిదారీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి ఈ మొత్తం ప్రాంతాన్ని వాటి విచ్చలవిడి దోపిడీకి నెలవుగా మల్చాలనే దుష్ట లక్ష్యంతోనే దోపిడీ ప్రభుత్వాలు ప్రజలకు వ్యతిరేకంగా ఈ అన్యాయమైన యుద్ధాన్ని ప్రారంభించాయి. ఈ దురుద్దేశ్యంతోనే ప్రజలను పెద్ద ఎత్తున గ్రామాల నుండి, అడవుల నుండి ఖాళీ చేయించే విధానాన్ని చేపట్టాయి. స్థానిక ఆదివాసుల నుండి కొందరు యువజనుల్ని ఎస్‌పీవోలుగా, కోయ కమాండోలుగా నియమించి వాళ్ల చేతులతో లెక్కలేనన్ని దౌర్జన్యాలు చేయించాయి.

ఎస్‌పీవోలుగా పని చేస్తున్న వాళ్లలో చాలా మంది తమంతట తాము కోరుకొని వెళ్లిన వాళ్లు కాదనీ, రకరకాల వత్తిళ్లకు గురై తప్పనిసరి పరిస్థితుల్లో ఎస్‌పీవోలుగా చేరిపోయారనీ మా పార్టీ నమ్ముతున్నది. చాలా మందిని అరెస్టు చేసి లేదా బలవంతంగా 'సహాయ' శిబిరాల్లోకి ఈడ్చుకెళ్లి కొట్టితిట్టీ, ప్రాణాలు తీస్తామని బెదిరించీ ఎస్‌పీవోలుగా మార్చుకున్నారు. మొదట ప్రభుత్వ బీభత్సానికి జడిసి ఎస్‌పీవోలుగా మారినప్పటికీ తర్వాత క్రమక్రమంగా వాళ్లలో భాగంగా మారి ప్రజలపై అమలు చేసిన ఘోర అకృత్యాలన్నిటిలో వాళ్లు భాగస్వాములయ్యారు. కొందరు ఎస్‌పీవోలు తమ ఇష్టానికి వ్యతిరేకంగా ప్రజలపై జరిపిన దారుణ హింసాదౌర్జన్యాల్లో పాలు పంచుకున్నారు. అందుకు వాళ్లు విచారిస్తున్నారు కూడా. మహేంద్ర కర్మ, రమన్‌సింగ్, విశ్వరంజన్, ననకీరాం వంటి తెల్ల, ఖాకీ బట్టల దళారులు 'శాంతి' మార్చ్ పేరుతో

పదుల వేల సంఖ్యలో పోలీసు, అర్ధసైనిక, నాగా–మిజో బలగాల్ని దించి సృష్టించిన హింసా బీభత్సాల విలయ తాండవంలో తమను పావులుగా వాడుకుంటున్నారనే స్పృహ కూడా చాలా మంది ఎస్పీవోలకు లేదు.

ప్రజలపై సాగుతున్న యుద్ధం – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్న కేంద్ర హోంమంత్రి చిదంబరం సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు వెలుగులో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించాడు. ఈ ఎస్పీవోల, కోయ కమాండోల వ్యవస్థను ఎలా కొనసాగించాలని కుయుక్తులు పన్నడమే ఈ సమావేశం వుద్దేశ్యమనేది స్పష్టమే. ఢిల్లీ నుండి రాయపూర్ వరకు రాజకీయ నాయకులు, పోలీసు వున్నతాధికారులు, అధికారగణం అందరూ ప్రజలపై సాగుతున్న అన్యాయమైన యుద్ధంలో ఎలాగైనా సరే ఎస్పీవోలను కొనసాగించడం కోసం రకరకాల ఎత్తులు వేస్తున్నారు.

మేం ఎస్పీవోలందరికీ స్పష్టం చేయదల్చుకున్నదేమంటే వాస్తవానికి ఈ పోరాటం మీకూ, మాకూ మధ్యన కాదు. ఈ పోరాటం దేశంలోని యావత్ శ్రామిక ప్రజలకూ, పిడికెడు మంది దోపిడీదొంగలకు మధ్య నడిచేది. ఒక వైపు దేశ జనాభాలో 95 శాతంగా వున్న పీడిత ప్రజలు – కార్మికులు, కర్షకులు, మధ్య తరగతి, దళితులు, ఆదివాసులు, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువాలందరూ ఇందులో భాగం – నిలబడగా, మరో వైపు జనాభాలో 5 శాతం కూడా లేని బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలు నిలబడ్డాయి. ఈ శత్రు వర్గాలకు సామ్రాజ్యవాదుల అండదండలున్నాయి. ఈ పోరాటంలో దోపిడీ పాలకవర్గాలు మిమ్మలను తమ రాజ్యయంత్రంలో భాగం చేసుకొని పావులుగా వాడుకుంటున్నాయి. బలిపశువుల్ని చేస్తున్నాయి. వాళ్లు తమ 'విభజించు – పాలించు' అనే విధానంలో భాగంగా ప్రజల్లోంచి ఒక సెక్షన్‌ను ముందుకు తెచ్చి దీన్ని ప్రజల మధ్య 'అంతర్యుద్ధం'గా చూపించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. మీరు ఏ ప్రజల్లోంచి వచ్చారో సరిగ్గా వాళ్లకే వ్యతిరేకంగా మిమ్మల్ని నిలబెట్టారు. న్యాయమైన డిమాండ్లతో పోరాడుతున్న ప్రజా వుద్యమాలకు వ్యతిరేకంగా మిమ్మల్ని వుసిగొల్పడానికి 'దేశ రక్షణ', 'దేశభక్తి' వంటి కొన్ని అబద్ధాల్ని పాలకవర్గాలు వుపయోగిస్తున్నాయి. నిజానికి మిమ్మల్ని ఈ యుద్ధంలోకి లాగిన వాళ్లే దేశానికి అతి పెద్ద శత్రువులు. వేల, లక్షల కోట్ల రూపాయల అవినీతి కుంభకోణాలకు పాల్పడే వాళ్లు; ముడుపుల కోసం దేశ సంపదలనే కాదు, దేశ సార్వభౌమత్వాన్ని సైతం కుదువ పెట్టేవాళ్లు; దేశ శ్రామిక ప్రజానీకాన్ని అడ్డగోలుగా దోచుకొని స్విస్ బ్యాంకుల్లో నల్లధనాన్ని దాచిపెట్టుకునే వాళ్లు – వీళ్ల మూలంగానే దేశంలోని 77 శాతం మంది ప్రజలు రోజుకు రెండు పూటల అన్నానికైనా నోచుకోకుండా బతుకులీడుస్తున్నది. పేదరికం, అధికధరలు, నిరుద్యోగం, అంటువ్యాధులు, ఆకలిచావులు, పౌష్టికాహారలేమి తదితర సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నది. కాబట్టి మీరు మీ అసలు శత్రువుల్ని గుర్తించండి. మీరెవరి గుండెల పైనైతే తుపాకుల్ని ఎక్కుపెట్టారో వాళ్లంతా మీ వాళ్లేనన్న విషయాన్ని మర్చిపోకండి.

మీ ఉద్యోగాలొదిలేసి తమ తమ గ్రామాలకు వెనక్కి రావాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఎస్పీవోలందరికీ పిలుపునిస్తున్నది. తమ గ్రామాలకు వచ్చి తాము చేసిన నేరాలన్నిటినీ స్వీకరించి ప్రజలను క్షమాపణ కోరుకోవడానికి సిద్ధపడేవాళ్లకు, ప్రభుత్వ యంత్రాంగంతో సంబంధాల్ని పూర్తిగా తెగతెంపులు చేసుకునేవాళ్లకు మేం – పార్టీ, ప్రజలు – పునరావాసం కల్పిస్తాం. ప్రజల ప్రభుత్వమైన జనతన సర్కార్ వాళ్లకు వ్యవసాయం కోసం భూముల్ని, ఇతర సాధనాల్ని సమకూరుస్తుంది. వాళ్ల జీవనోపాధికి గ్యారంటీ కల్పించబడుతుంది. కనుక, దోపిడీ ప్రభుత్వాలు సృష్టించిన తప్పుడు ప్రచారం నుండి, కుట్రపూరిత విషవలయం నుండి బైటపడాలని మేం ఎస్పీవోలందరినీ కోరుతున్నాం. వాళ్ల ఎంగిలి మెతుకులకు ఆశ పడకుండా తమ స్వంత కాళ్లపై నిలబడి తమ గ్రామాలలో తమ వాళ్ల మధ్య తలెత్తుకొని జీవించడానికి ముందుకు రమ్మని కోరుతున్నాం. అభద్రత, అశాంతులతో ఊపిరాడని వాతావరణంలో బతకకండి. జల్–జంగల్–జమీన్‌పై అధికారం కోసం, తమ అమూల్యమైన ప్రకృతి సంపదల కార్పొరేట్ నిలువుదోపిడీకి వ్యతిరేకంగా సాగుతున్న దండకారణ్య ప్రజల న్యాయమైన పోరాటాలకు మద్దతునివ్వండి.


**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**